క్లుప్తంగా

బీసీలకు టికెట్లు కేటాయించాలి

గద్వాల అర్బన్: నియోజకవర్గంలో అన్ని రాజకీయా పార్టీలు బీసీలకు టికెట్లు కేటాయించాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు గౌడ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని నాల్గవ వార్డులో బీసీ ఐక్యవేదిక సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం జిల్లా కన్వీనర్‌గా పరశురాముడిని నియమించారు. కార్యక్రమంలో రాజు, లింగంగౌడ్, రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

గద్వాల అర్బన్: మల్దకల్ మండలం మద్దెలబండ పెద్దతండాకు చెందిన పలువురు శనివారం జిల్లా కేంద్రంలోని డీసీసీ అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయన నివాసంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ బలోపేతం కోసం పని చేయాలన్నారు. కార్యక్రమంలో అలెగ్జాండర్, జమాల్, రఘునాయుడు, శివనాయక్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని డ్యాం రోడ్డులో ఉన్న సబ్‌స్టేషన్ మరమ్మతు కారణంగా ఆదివారం తాత్కాలిక విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ రమేష్ బాబు శనివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 6:30 గంటల నుంచి 9:30 గంటల వరకు గద్వాల టౌన్ ఓల్డ్ సబ్‌స్టేషన్ పరిధిలోని గంజిపేట, గాంధీచౌక్, సుంకులమ్మమెట్టు, తెలుగుపేట, కుంటవీధి, దౌదర్‌పల్లి, అయిజ రోడ్డు, తేరుమైదానం, రాంనగర్, వేదనగర్ కాలనీలకు సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎంపిక

అయిజ: మండలంలోని మేడికొండలో శనివారం ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జ్ నరేష్ ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవన్న, ఉపాధ్యక్షుడిగా ప్రభు, ప్రధాన కార్యదర్శిగా ఏసన్న, పలువురిని ఎంపిక చేశారు. వారికి నియామక పత్రాలు అందజేశారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు

ధరూరు: స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయా పాఠశాలల్లో ఆటల పోటీలు ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా పాఠశాలల్లో సందడి కనిపిస్తుంది. దినోత్సవానికి ఇంకా రెండు రోజులే మిగిలి ఉండడంతో విద్యార్థులకు కబడ్డీ, వాలీబాల్, రన్నింగ్, స్కిప్పింగ్, ఖోఖో వంటి పోటీలు నిర్వహిస్తున్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని ఆయా పాఠశాల హెచ్‌ఎంలు తెలిపారు.

పార్టీ పటిష్టతకు కృషి చేయాలి

మల్దకల్: కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కార్యకర్తలు, నాయకులు తమ వంతు కృషి చేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రం, ఎల్కూర్‌లో జిల్లా అధ్యక్షుడు పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. ప్రజావ్యతిరేక విధానాలను చేపడుతున్న పార్టీలకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. అనంతరం ఆయా గ్రామాలలో బీఆర్‌ఎస్, బీజేపీకి చెందిన నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో తిరుపతయ్య, బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనాథ్‌రెడ్డి, మద్దిలేటి, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన పద్మశాలీలు

గద్వాల అర్బన్: పద్మశాలీల డిమాండ్ల సాధనకు ఆదివారం జగిత్యాల జిల్లా కోరుట్లలో చేపట్టిన పద్మశాలి రాజకీయ యుద్ధభేరి భారీ బహిరంగ సభకు శనివారం జిల్లా కేంద్రంలోని పద్మశాలి కల్యాణ మండపం నుంచి పెద్ద ఎత్తున్న తరలివెళ్లారు. సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు పద్మశాలీలకు సముచిత స్థానం కల్పించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సభకు వెళ్లిన వారిలో నారాయణ, రామకృష్ణ, నర్సింహులు, నాగరాజు, భీమేష్ ఉన్నారు.

బీఎస్పీ నాయకుల నిరసన

ఎర్రవల్లిచౌరస్తా: బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్ హౌజ్ అరెస్టును ఖండిస్తూ ఇటిక్యాల మండల కేంద్రంలో శనివారం బీఎస్పీ నాయకులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వం వెంటనే గ్రూప్–2 పరీక్షను వాయిదా వేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

టమాట లోడ్ వాహనం బోల్తా

ఉండవెల్లి: జాతీయ రహదారిపై బొలెరో వాహనం మండల కేంద్రం సమీపంలోని పత్తి మిల్లు వద్ద అతివేగంతో శనివారం రాత్రి బోల్తా పడింది. రెండు టన్నుల టమాట లోడ్‌తో డ్రైవర్ బోయరాము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపూర్ జిల్లా కల్యాణదుర్గం నుంచి హైదరాబాద్ మార్కెట్‌కు ఉదయం బయలుదేరింది. ఈ ప్రమాదంలో వాహనం దెబ్బతినగా, డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వాహనాన్ని క్రేన్ సాయంతో పక్కకు తరలించి, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చేశారు.

సరిపడని క్రీడా కిట్లు ఎవరి కోసం?

- ప్రతి పంచాయతీకి ఒక్కటే కిట్
- క్రీడామైదానంలో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులు మాత్రమేనన్న అధికారులు
- మరి క్రికెట్ కిట్లు క్రీడాకారులకా? ప్రజాప్రతినిధులకా?



తక్కశిలలో క్రీడా ప్రాంగణం

ఉండవెల్లి: పల్లెల్లో యువత క్రీడా మైదానాలు లేక పొలాల్లో ఆడుకుంటారు. ఎక్కువగా క్రికెట్, కబడ్డీ, వాలీబాల్ ఆటలు ఆడేందుకు ఆసక్తి చూపుతారు. కాగా గ్రామాల్లో క్రీడాకారుల సౌలభ్యం కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా తెలంగాణ క్రీడామైదానాలను తయారు చేసి అందులో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ ఆడేందుకు ఏర్పాటు చేశారు.

16 పంచాయతీల్లో 14 మాత్రమే మైదానాలు

మండలంలోని 16 పంచాయతీలలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కానీ కొన్ని చోట్ల క్రీడా మైదానాలు లేక అవస్థలు పడుతున్నారు. గ్రామీణ యువతకు, పట్టణాలలోని వారికి క్రీడాలలోనే తేడా కనబడుతుంది. మండలంలో 14 పంచాయతీలో మాత్రమే క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారు. కొన్ని చోట్ల స్థలాలు, నిధులు లేక ఏర్పాటు చేయలేదని తెలిసింది.

క్రికెట్ కిట్లపై అనుమానం

మండలంలో 16 పంచాయతీలకు క్రికెట్, వాలీబాల్, డంబెల్స్ కిట్లు 17 వచ్చాయి. 14 గ్రామాల్లోని క్రీడా మైదానాలు ఉన్నాయని, మిగితా 3 కిట్లను ఎవరికి ఇస్తారనేది చర్చనీయాంశం. కాగా తెలంగాణ క్రీడామైదానంలో కేవలం వాలీబాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులు మాత్రమే ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. ఇందులో క్రికెట్ ఆడడానికి వీలుపడదు. అలాంటప్పుడు క్రికెట్ కిట్లు ప్రజాప్రతినిధులకా? లేక క్రీడాకారులకు ఇస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది.

క్రీడాకారులకు అందజేయడం మంచిదే



ప్రతి గ్రామానికి క్రీడాకిట్లు అందజేయడం మంచిదే. క్రీడాకారులకు క్రికెట్ కిట్లు ఇచ్చి ప్రోత్సహించాలి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్రీడామైదానం ఏర్పాటు చేయడం మంచి ఆలోచన. క్రీడాలపై ప్రత్యేక శ్రద్ధ చూపించి యువతకు అవకాశం కల్పించాలి.
–మహేష్, ఉండవెల్లి

ఎవరికి ఇవ్వాలో ఉత్తర్వులు రాలేదు



మండలానికి 17 కిట్లు వచ్చాయి. వాటిని ఎంపీడీఓ కార్యాలయంలో భద్రపరిచాం. క్రికెట్, వాలీబాల్ కిట్లు, డంబెల్స్, టీషట్లు తదితర కిట్లు వచ్చాయి. ఎవరికి ఇవ్వాలో త్వరలో ఉన్నతాధికారులకు ఆదేశాల మేరకు అందజేస్తాము.
– అంజనేయరెడ్డి, ఎంపీడీఓ

ప్రజా సంక్షేమమే ధ్యేయం


కమ్యూనిటీ భవన నిర్మాణానికి ప్రొసిడింగ్ కాపీని అందజేస్తున్న ఎమ్మెల్యే అబ్రహం

అలంపూర్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో ఉండవెల్లి మండలం శాలివాహన కుమ్మరి సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రూ. 5లక్షల ప్రొసిడింగ్ కాపీని సంఘం నాయకులకు శనివారం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ అన్ని వర్గాలకు సమ న్యాయం చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో కమ్యూనిటీ భవనాలకు నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు.

ఎల్‌ఓసీ అందజేత

అయిజ మండలం తూంకుంటకు చెందిన సత్యమ్మ అనారోగ్యంతో చికిత్స పొందుతుండగా రూ.1.50 లక్షల ఎల్‌ఓసీని ఎమ్మెల్యే అందజేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

అలంపూర్: పేద ప్రజలకు సీఎం సహాయ నిధి వరమని ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. అలంపూర్ చౌరస్తాలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. అయిజ మండలం మేడికొండకు చెందిన కటిక అబ్దుల్లాకు రూ. 1.50 లక్షలు మంజూరు కాగా, చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతారావు, మల్లేష్, నర్సింహ, సూర్యగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఆదిశిలాక్షేత్రంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

మల్దకల్: మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న ప్రధాన దేవాలయాల్లో భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వర స్వామి, సద్దలోనిపల్లి కృష్ణస్వామి, కుర్తిరావులచెర్వు గట్టు తిమ్మప్ప, శేషంపల్లి శివసీతా రామస్వామి, చర్లగార్లపాడు వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బీచుపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో..

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు అభయాంనేయస్వామికి ఆకు పూజ, పంచామృత అభిషేకం నిర్వహించారు.

అనారోగ్యానికి గురికాకుండా చూసుకోండి


వడ్డేపల్లిలో గేదెకు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

శాంతినగర్: పశువులు అనారోగ్యం బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారి పుష్పలత అన్నారు. వడ్డేపల్లి పట్టణం, తిమ్మాజిపల్లిలో పశువులకు శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతు టీకాలను వారి పశువులకు తప్పకుండా వేయించాలన్నారు. ఇతరత్రా వ్యాధులు ఏవైనా పశువులకు సంక్రమిస్తే వెంటనే పశు వైద్యులను సంప్రదించి చికిత్సలు చేయించాలన్నారు. సిబ్బంది వరప్రసాద్, లతీఫ్, రవి, కృష్ణ, వెంకటమ్మ పాల్గొన్నారు.

అయిజ: పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా ముందుగా టీకాలు వేసే కార్యక్రమం మండలంలోని వివిధ గ్రామాల్లో కొనసాగుతుంది. వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని తొత్తినోనిదొడ్డి, జడదొడ్డిలో ఆవులు, గేదెలు, ఎద్దులు మొత్తం 211 పశువులకు టీకాలు వేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు


డ్రంకెన్‌డ్రైవ్ టెస్ట్ చేస్తున్న ఎస్‌ఐ నరేష్ కుమార్

అయిజ: ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని ఎస్‌ఐ నరేష్‌కుమార్ సూచించారు. శనివారం రాత్రి పట్టణంలోని ప్రధాన రోడ్లపై డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదుచేస్తామన్నారు. ప్రమాదాలు జరిగిన వాటిలో ఎక్కువ శాతం మద్యం సేవించిన వారివే ఉన్నాయని తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం చెందిన అబ్దుల్లా (37) ఈ నెల 9వ తేదీ నుంచి అదృశ్యమైనట్లు భార్య పర్వీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు శనివారం తెలిపారు. అతనికి 5 ఏళ్ల నుంచి మతిస్థిమితం లేదని చుట్టు పక్కల గ్రామాల్లో గాలించినా ఆచూకీ లభించలేదన్నారు.

‘గృహలక్ష్మి’ దరఖాస్తుల స్వీకరణ


కేటీదొడ్డిలో దరఖాస్తులను అందజేస్తున్న ప్రజలు


ధరూరులో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కేటీదొడ్డి: గృహలక్ష్మి దరఖాస్తులను స్వీకరించేందుకు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ మహ్మద్ అజార్ మొహిద్దీన్ తెలిపారు. శనివారం 297 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. మొత్తం 3,033 దరఖాస్తులు స్వీకరించినట్లు వారు పేర్కొన్నారు.

గట్టు: వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు పెద్ద ఎత్తున మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని దరఖాస్తూలను సమర్పిస్తున్నారు. శనివారం సాయంత్రం దాకా 2,413 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ చెన్నయ్య తెలిపారు.

అలంపూర్ రూరల్: మండలంలో 112 గృహలక్ష్మి దరఖాస్తులు వచ్చినట్లు శనివారం ఎంపీడీఓ గోవిందరావు తెలియజేశారు.

ధరూరు: అధికారులు సాయంత్రం వరకు కార్యాలయంలో దరఖాస్తులను స్వీకరించారు. ఇప్పటి వరకు మొత్తం 1,980 వచ్చినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. సోమవారం వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు.

అందుబాటులో ‘ఆయుష్మాన్ భారత్’

- జిల్లాలో 6 లక్షల మందికి లబ్ధి
- ప్రభుత్వ నిర్ణయంతో ఊరట
- అందరికీ వైద్య సేవలు


జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న రోగులు (ఫైల్)

గద్వాల క్రైం: ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కార్డు ద్వారా ఉచితంగా వైద్యం అందించే వారు. ఇటీవల ప్రభుత్వం తాజా నిర్ణయంతో ప్రతి ఒక్కరికి మెరుగైన వైద్య సదుపాయలు అందాలనే లక్ష్యంతో గతేడాది జూన్ నుంచి ఆయుష్మాన్‌భారత్ అమలులోకి రావడంతో జిల్లా వ్యాప్తంగా 1.61 లక్షల రేషన్ కార్డులు ఉండాగా, 6లక్షకు పైగా ప్రజలకు లబ్ధి చేరనుంది. ఇక ఆహార భద్రత కార్డుల ద్వారానే సేవలు అందుతున్నాయి. ఈ పథకం అమలుతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు....

ఆయుష్మాన్ భారత్ ద్వారా 932 రకాల వ్యాధులకు సేవలు అందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ సేవలు అమలవుతున్నాయి. ఇక ఆహారభద్రత కార్డు అమలోకి రావడంతో 5 సంవత్సరాలు నిండిన పిల్లలకు సౌలభ్యంగా మారింది. గతంలో తెల్లరేషన్ కార్డులో పేరు ఉన్న వారికి మాత్రమే సేవలు అందేవి. అంతే కాకుండా 5 ఏళ్లలోపు పిల్లలకు కూడా తల్లి లేదా తండ్రి పేరుతో ఆరోగ్య శ్రీ సేవలు అందించే వెసులుబాటుంది.

అన్ని సేవలు..

జిల్లాలోని ప్రభుత్వాసుపత్రి, రెండు ప్రైవేట్ ఆస్పత్రుల్లో హెల్త్ కార్డు, డయాలిసిస్ రోగులకు ఆరోగ్య శ్రీ ద్వారా సేవలు అందుతున్నాయి. అయితే అన్ని సేవలు ప్రధాన ఆస్పత్రితోపాటు ప్రైవేట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలల్లో జూన్ నుంచి సేవలు అమల్లోకి తీసుకువచ్చారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుడు ఉండగా, దశల వారీగా త్వరలో ఇద్దరి నుంచి ముగ్గురు చొప్పున నియామించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. జిల్లాలోని పల్లె దవాఖానలు, బస్తీ దవాఖానల ద్వారా సేవలు అందిస్తున్నారు. తీవ్రగాయాలపాలైన వారు, పాముకాటు, వడదెబ్బ, డెంగీ, విరోచనలు, మలేరియా, బీపీ, మధుమేహం తదితర రోగాలకు జిల్లా ప్రభుత్వాసుపత్రిలోనే సేవలు అందుతున్నాయి. ఆస్పత్రిలో ఏ రోజు ఎవరు వచ్చారు, ఎలాంటి జబ్బులున్నాయి, ఎంత మంది వచ్చారనే అంశంపై ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు చేస్తున్నారు.

పేదల కోసమే..



తెల్లరేషన్ కార్డు ఉన్న వారికే ఆరోగ్య శ్రీ ద్వారా ఉచిత వైద్యం లభించేది. కార్డు లేని వారు ప్రత్యేకంగా ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే రెండు, మూడు రోజుల ప్రక్రియతో తాత్కాలిక ఆరోగ్య శ్రీ కార్డు వచ్చేది. పేద ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా ఉండాలనే లక్ష్యంతో ఆహారభద్రత కార్డు ఉన్న ప్రతి కుటుంబ సభ్యులకు ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య శ్రీ సేవలు అందించాలనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వాసుపత్రిలోనే మెరుగైన సేవలు అందిస్తున్నాం. జిల్లా ఆస్పత్రిలో అధునాత పరికరాలు, మౌలిక వసతులు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారు.
– శశికళ, జిల్లా ఇన్‌చార్జ్ వైద్యాధికారి


ఫ్యాషన్ షోలో చేనేత చీరకట్టుతో ఆకట్టుకున్న వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులు, పంచకట్టుతో ఆకట్టుకున్న విద్యార్థులు

చేనేత.. అందాల కలబోత



గద్వాల:ఫ్యాషన్ అంటే.. పాశ్చాత్యా దుస్తులు.. మార్కెట్‌లోకి అప్పుడే దిగిన ట్రెండింగ్ రూపాలు.. ఇవి ఒకప్పుడు. ఇప్పుడు కాలం మారుతోంది. యువత ఆలోచనలు, అభిప్రాయాలు భిన్నంగా ఉంటున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లా చేనేత, జౌళీ శాఖ శనివారం స్థానిక కలెక్టరేట్‌లో విద్యార్థులకు ఫ్యాషన్ షో నిర్వహించింది. చేనేత వారోత్సవాలలో భాగంగా నిర్వహించిన ఈ షో చూపరులను కట్టిపడేసింది. సంప్రదాయ చేనేత వస్త్రాలు ధరించి చూడముచ్చటైన విద్యార్థులు ర్యాంపుపై నడిచారు. చేనేత కళకు ఆధునీకతను జోడించి సరికొత్తగా రూపొందించిన వస్త్రశ్రేణి ఆహుతులను ఆకట్టుకుంది. విద్యార్థినులు చేనేత చీరకట్టుతో క్యాట్‌వాక్ చేశారు. అబ్బాయిలు సైతం చేనేత పంచకట్టుతో ఆదరహో అనిపించారు. కార్యక్రమానికి కలెక్టర్ వల్లూరు క్రాంతి, అడిషినల్ కలెక్టర్లు అపూర్వ్‌చౌహాన్, చీర్ల శ్రీనివాస్, ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హజరై ఫ్యాషన్ షోను తిలకించారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు.

ఎర్రసత్యం సేవలు మరువలేనివి


నివాళి అర్పిస్తున్న తెలుగు ముదిరాజ్ మత్స్యకారుల సంఘం నాయకులు

గద్వాల అర్బన్: దివంగత మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం సేవలు మరువలేనివని తెలుగు ముదిరాజ్ మత్స్యకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో ఎర్రసత్యం వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బడుగు, బలహీన వర్గాల వారిని ఆదుకోవడంలో ఎర్రసత్యం ఎనలేని సేవలందించి నేటికి ప్రజల గుండెల్లో నిలిచారన్నారు. కార్యక్రమంలో లక్ష్మన్న, దౌలు, శ్రీను, జగదీష్, భాస్కర్, పాండు, నర్సింహులు, చిరు, హరి, రఘు, రమేష్, బాలు తదితరులు ఉన్నారు.

ఐక్యతతో పాత పెన్షన్ సాధించుకుందాం



అలంపూర్ చౌరస్తా నుంచి తరలివెళ్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు


గద్వాల నుంచి హైదరాబాద్‌కు బయలుదేతున్న సీపీఎస్ ఉద్యోగులు

అలంపూర్: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఐక్యతతో పోరాడి పాత పెన్షన్ విధానాన్ని సాధించకుందామని టీఎస్‌సీపీఎస్‌ఈయూ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. అలంపూర్‌చౌరస్తా నుంచి నియోజకవర్గంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు హైదరాబాద్‌లో నిర్వహించే ఓపీఎస్ సాధన సంకల్పయాత్ర భారీ బహిరంగసభకు శనివారం తరలివెళ్లారు. అలంపూర్, ఉండవెల్లి, మానవపాడు, వడ్డేపల్లి, రాజోలి మండలాల నుంచి 400 మంది వాహనాలు, బస్సులలో తరలి వెళ్లినట్లు తెలిపారు. బహిరంగసభకు 54 ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు మద్దతు పలికినట్లు పేర్కొన్నారు. సభకు తరలిన వారిలో ప్రతాప్‌రెడ్డి, రామకృష్ణ, కృష్ణ, సతీష్ కుమార్, దేవేందర్‌రెడ్డి, లక్ష్మణ్, గోపాల్‌రెడ్డి, వెంకట్‌నాయుడు, ఈశ్వర్, వెంకటకృష్ణ, రజని, పుష్పకుమారి, రాధిక, మంజుల, రాజగోపాల్ రెడ్డి, మక్బుల్ తదితరులు ఉన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

గద్వాల అర్బన్: సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని శనివారం చలో హైదరాబాద్ కార్యక్రమానికి సీపీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా నుంచి నుంచి ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున్న తరలివెళ్లారు. జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి చౌరస్తాలో జెండా ఊపి వాహనాల ర్యాలీ ప్రారంభించారు. 3.30లక్షల మందితో సీపీఎస్ ఉద్యోగులు సభకు వస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి ‘మేరి మట్టి.. మేరా దేశ్’


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గద్వాల: బీజేపీ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి మంగళవారం వరకు జిల్లాలో ‘మేరీ మట్టి మేరా దేశ్’ కార్యక్రమాలను చేపడుతున్నట్లు జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారిని స్మరించుకుంటూ వారి కుటుంబసభ్యులను గౌరవించాలన్నారు. అందులో బాగంగా 13న అలంపూర్‌లో, 14న గద్వాలలో తిరంగా యాత్ర నిర్వహిస్తున్నామని వివరించారు. సమావేశంలో గడ్డం కృష్ణారెడ్డి, రామంజనేయులు, రాజగోపాల్, రవికుమార్, కుమ్మరి శ్రీను, భారతి, హరి, పవన్ తదితరులు పాల్గొన్నారు.